ప్రజాశక్తి
మంగళవారం 23 జనవరి 2024
5
శ్రీకాకుళం

నేడు షర్మిల జిల్లా రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షులు వైఎస్ షర్మిల ఈనెల 23న జిల్లాలో పర్యటించనున్నారని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ఇచ్ఛాపురం చేరుకుని కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ముగించిన విజయ స్థూపం వద్ద ఆయనకు నివాళ్లర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఇచ్ఛాపురం పట్టణంలోని ఆర్.జె ఫంక్షన్ హాలులో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ప్రసంగిస్తారని తెలిపారు. ఆమెతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలకడంతో పాటు విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

18,59,910



- జిల్లాలో ఓటర్ల సంఖ్య
- మహిళలే అధికం
- శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 2,70,055
- ఆమదాలవలసలో అత్యల్పంగా 1,92,560 మంది ఓటర్లు
- ఓటర్ల స్పెషల్ సమ్మరీ రివిజన్ జాబితా విడుదల

జిల్లాకు సంబంధించి ఓటర్ల స్పెషల్ సమ్మరీ రివిజన్ జాబితా సోమవారం విడుదలైంది. ప్రతి ఏడాదీ ఈ తరహా జాబితాను విడుదల చేయడం సాధారణమే అయినా మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రాధ్యానత సంతరించుకుంది. గతేడాది అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలతో కూడిన జాబితాను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ విడుదల చేశారు. జాబితాలను ఇఆర్ఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో, పోలింగ్ కేంద్రాలు, బిఎల్ఒల వద్ద నేటి నుంచి అందుబాటులో ఉంచనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 జాబితా ప్రకారం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోని 18,59,910 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 9,22,442 మంది పురుషులు, 9,37,329 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 139 మంది ఉన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 2,70,055 మంది ఓటర్లు ఉన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో అత్యల్పంగా 1,19,560 మంది ఓటర్లు ఉన్నారు. ఓటు నమోదులో ఈసారి యువత మంచి ఉత్సాహం కనబరిచారు. యువ ఓటర్ల నమోదు విషయంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో 18-19 సంవత్సరాల వయసున్న ఓటర్లు 35,037 మంది ఉన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 4,779 మంది యువకులు ఓటర్లుగా నమోదయ్యారు. ఆమదాలవలసలో అత్యల్పంగా 3,648 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 80 ఏళ్లు పైబడిన వారు 21,042 మంది ఓటర్లు ఉన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అత్యధికంగా 4,431 మంది వృద్ధులు ఉండగా, నరసన్నపేటలో అత్యల్పంగా 2,867 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం 70 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 61 మంది, మహిళా ఓటర్లు తొమ్మిది మంది ఉన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సేవా రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 16,100 మంది ఓటర్లుగా నమోదయ్యారు. పలాసలో అత్యధికంగా 2,976 మంది ఉండగా అత్యల్పంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 901 మంది ఉన్నారు. జిల్లాలో అంగవైకల్యం ఉన్న వారు 20,732 మంది ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

కొత్తగా 88,523 మంది ఓటర్లు చేరిక

జిల్లాలో ఫారం-6 (కొత్తగా ఓటరు నమోదు), ఫారం-6ఎ (ఎన్ఆర్ఐ) ఫారం-8 (వేరే చోటుకి మార్పు) దరఖాస్తుల ద్వారా మొత్తం 88,523 మంది ఓటర్లు చేరారు. వీరిలో ఫారం-6 ద్వారా 65,621 మంది, ఫారం-6ఎ ద్వారా తొమ్మిది మంది చేరారు. ఫారం-8 ద్వారా 22,893 మంది ఓటర్లుగా చేరారు. మూడు కేటగిరీల్లో ఎచ్చెర్లలో అత్యధికంగా 14,931 మంది ఓటర్లుగా చేరారు. ఆమదాలవలసలో అత్యల్పంగా 6,554 మంది కొత్త జాబితాలో ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఇచ్ఛాపురం	1,29,579	1,36,427	17	2,66,023
పలాస	1,06,817	1,11,365	26	2,18,208
టెక్కలి	1,16,944	1,17,383	10	2,34,337
పాతపట్నం	1,11,301	1,11,843	13	2,23,157
శ్రీకాకుళం	1,33,772	1,36,252	31	2,70,055
ఆమదాలవలస	95,539	97,005	16	1,92,560
ఎచ్చెర్ల	1,22,169	1,20,455	13	2,42,637
నరసన్నపేట	1,06,321	1,06,599	13	2,12,933

నామినేషన్ల వరకు ఓటరుగా నమోదు

ప్రస్తుతం విడుదల చేసిన ఓటరు జాబితా తుది జాబితా కాదని, నామినేషన్లు వేసే వరకు ఓటరుగా నమోదుకు అవకాశం ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చెప్పారు. కలెక్టరేట్‌లో ఓటరు జాబితా విడుదల చేసి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తులు మాత్రమే జాబితాలో ఉంటుందని తెలిపారు. ఓటు హక్కు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటికీ ఓటు హక్కు నమోదుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. కొత్తగా ఓటు కోసం ఓటర్స్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌లో గానీ ఓటర్స్.ఇసిఐ.జిఒవి వెబ్‌సైట్‌లో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎవరైనా ఎటువంటి తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్లు తొలగించాలంటూ టెక్కలి నియోజకవర్గంలోని నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి దరఖాస్తు చేసిన నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ముసాయిదా జాబితాపై 44 వేల ఫిర్యాదులు వచ్చాయని, అందులో సుమారు 9,100 ఫిర్యాదులు నిజమైనవని గుర్తించి పరిష్కరించామన్నారు. ఫిర్యాదులు రాకముందే 5,476 మంది ఓటర్లకు సంబంధించిన సమాచారాన్ని సరిచేశామని తెలిపారు. ఎన్నికల ప్రత్యేక జాబితా అంశంపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో పలుదఫాలుగా సమావేశాలు నిర్వహించామని, అన్ని పార్టీలు సంతృప్తి వ్యక్తం చేశాయని తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో అత్యంత పారదర్శకతతో పనిచేసిన సిబ్బందిని అభినందించారు. ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

జీరో డోర్ నంబరుతో 308 ఓటర్లు

జిల్లాలో జీరో డోరు నంబరుతో 2023, జూన్ 19వ తేదీ నాటికి 19,614 మంది ఓటర్లు ఉన్నారు. అక్టోబరు 27వ తేదీ నాటికి 2,206 మంది ఓటర్లు ఉన్నారు. సవరణల తర్వాత సాంకేతిక కారణాలతో 308 మంది మిగిలారు. వీటిని సరిచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చాలి
- అక్రమ అరెస్టులకు నిరసనగా వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమస్యల పరిష్కారం కోరుతూ 42 రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమంగా అరెస్టులు చేయడం తగదని, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధానికి నిరసనగా నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేపట్టారు. నిరవధిక నిరాహార దీక్షలో ఉన్న అంగన్వాడీ నాయకులతో పాటు అంగన్వాడీలను అర్ధరాత్రి అమానుషంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, సోంపేట, జి.సిగడాం, పొందూరు తదితర మండలాల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. విజయవాడలో తెల్లవారుజామున మూడు గంటల సమయంలో వందలాది మంది పోలీసులు టెంట్‌ను తొలగిస్తూ, కరెంట్ తీసేసి దీక్షలో ఉన్న వారిపై కనికరం కూడా చూపకుండా, మహిళలనీ చూడకుండా అమానుషంగా వ్యవహరించారని తెలిపారు. సమస్యలపై పోరాడుతున్న మహిళల గొంతు నొక్కే చర్య సరికాదన్నారు. మగ పోలీసులు అంగన్వాడీలపై దురుసుగా వ్యవహరించడం చట్ట విరుద్ధమన్నారు. కవరేజీకి వచ్చిన మీడియాపైనా దురుసుగా ప్రవర్తించారని విమర్శించారు. సమస్యను సామరస్యపూర్వకంగా చర్చించి, పరిష్కరించాల్సింది పోయి అంగన్వాడీల ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం దారుణమన్నారు. అక్రమంగా నిర్బంధించి అంగన్వాడీలను తక్షణం విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించకపోయినా సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జిఒ జారీ చేయడం, నోటీసులు ఇస్తూ బెదిరించడం తగదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పెరిగిన ధరలకనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చేయాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు కె.మోహనరావు, కె.నాగమణి, శ్రీదేవి పాణిగ్రాహి, ఎ.లక్ష్మి, కె.అప్పారావు, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

42వ రోజుకు అంగన్వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - ఆమదాలవలస, టెక్కలి రూరల్

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 42 రోజులకు చేరింది. సమ్మెలో భాగంగా ఆమదాలవలసలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మనసు మార్చి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దీపాలు వెలిగించి మొక్కుతూ నిరసన తెలిపారు. టెక్కలిలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలను ఉద్దేశించి సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు మాట్లాడారు. తన చెల్లెలు వ్యతిరేకిస్తుండడంతో రాష్ట్రంలోని అందరు అంగన్వాడీ అక్కాచెల్లెళ్లపై జగన్ కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగేళ్లుగా అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్ధంగా సమ్మె చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మొదలవలస లత, మాధవి, రమ, ఉష తదితరులు పాల్గొన్నారు.

దీపాలు వెలిగించి మొక్కుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చంద్రబాబు చివరి అస్త్రం షర్మిల : వైసిపి

నరసన్నపేట : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చివరి అస్త్రం షర్మిల అని, వైఎస్ అభిమానుల ఓట్లు చీలితే తనకు కొంతైనా కలిసొస్తుందని బాబు భావిస్తున్నారన్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కానీ రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదనే వాస్తవాన్ని వారిరువురూ గుర్తించాలన్నారు. పిసిసి అధ్యక్ష బాధ్యతల స్వీకరణ సందర్భంగా షర్మిల చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును సిఎం చేయాలన్నదే షర్మిల లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. తెలంగాణ నుంచి ఎపికి హఠాత్తుగా షర్మిల ఎందుకు షిఫ్ట్ అయ్యారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణాన్ని అంటూ బిల్డప్ ఇచ్చి ఇప్పుడు అదే నోటితో జగన్ రెడ్డి అని సంబోధించడం ఎలాంటి నైతికత అని ప్రశ్నించారు. మహా నేత కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరకాల ప్రత్యర్థి చంద్రబాబుతో చేతులు కలిపిన షర్మిల వైఎస్ ప్రతిష్టని దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని, దీనికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు.

చంద్రబాబును జనం నమ్మరు

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంకలా మారుతుందని విష ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు అవే పథకాలను తానూ ఇస్తానని చెప్పున్నారని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా, ఎన్ని మాటలు చెప్పినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మండలంలోని మాకన్నపల్లిలో సచివాలయం, హెల్త్ క్లినిక్, నీలావతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన అభివృద్ధి కన్నా ఈ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎక్కువ అభివృద్ధి చేశారని చెప్పారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు అభివృద్ధి చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చంద్రబాబు చెప్పున్నారని... ఆయన సృష్టించిన సంపద, చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు పక్కన కూర్చోబెట్టారని విమర్శించారు. ఉద్దానం ప్రాంతంలో ఎక్కువగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారని గుర్తించి 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించి ఉద్దాన ప్రజలకు అంకితం చేశామన్నారు. రూ.700 కోట్లతో శుద్ధజలం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 40వేల పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేశామని చెప్పారు. జీడి రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో జీడి రైతులతో ఈనెల 24వ తేదీన సిఎంఒ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 60 ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని పరిపాలించిన గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. అనంతరం టిడిపి నుంచి వైసిపిలోకి పలువురు చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపిపి ఉంగ ప్రవీణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, తహశీల్దార్ మధుసూదనరావు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, సర్పంచ్‌లు సైని దేశయ్య, సొర పద్మావతి, తామాడ మదన్, కోరాడ ధనరాజ్, ఎం.ఎన్ మూర్తి, తెప్పల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

బిసి కార్పొరేషన్లు నిర్వీర్యం

ప్రజాశక్తి - ఆమదాలవలస

బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు నూక రాజు అధ్యక్షతన జయహో బిసి సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12 శాతం ఉన్న రెడ్డిలు 78 శాతం ఉన్న బిసిలను అణగదొక్కి పాలిస్తున్నారని ధ్వజమెత్తారు. బిసిలకు పదవులు ఇచ్చామని వైసిపి చేపట్టిన సామాజిక బస్సు యాత్రలో నాయకుల ప్రసంగాలు ముగియక ముందే సభల నుంచి ప్రజలు వెళ్లిపోయారని చెప్పారు. బిసిలకు ఏటా రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తామని నమ్మబలికిన జగన్, కార్పొరేషన్లుగా విభజించి పార్టీ నాయకులకు పదవులు ఇచ్చి ఉత్సవ విగ్రహాలుగా నిలిపారన్నారు. కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. చివరకు సబ్‌ప్లాన్ నిధులను దళితుల ప్రయోజనాలకు ఇవ్వకుండా దారిమళ్లించారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని... ఎస్‌సి, ఎస్‌టి, బిసి బ్యాక్‌లాగ్ పోస్టులను మంజూరు చేయకుండా తాత్సారం చేసిందని విమర్శించారు. ఎన్నికలకు మరో రెండు నెలల సమయం మాత్రమే ఉందని, టిడిపి కార్యకర్తలు కార్యోన్ముఖులై వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. సభలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బోర గోవిందరావు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కలగ జగదీష్, నియోజకవర్గ అధ్యక్షులు చింతాడ వాసుదేవరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూన రవికుమార్

ఫైబర్ నెట్ ద్వారా ట్రిపుల్ ప్లే సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఎపి ఫైబర్ నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్ మేనేజర్ గౌతమ్ కుమార్ తెలిపారు. ఇంటర్నెట్‌తో పాటు ట్రిపుల్ ప్లే సేవలు ఈ కనెక్షన్ ద్వారా పొందవచ్చని చెప్పారు. ఈ సౌకర్యాన్ని కేబుల్ ఆపరేటర్లు ప్రజలకు దగ్గర చేయాలని కోరారు. నగరంలోని ఫైబర్ నెట్ కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్ల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ధరలకు ఇంటర్నెట్ సౌకర్యం, ట్రిపుల్ ప్లే సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ నెట్‌వర్క్ సర్వీసులను తీసుకుంటే రూ.లక్షల్లో ఖర్చవుతోందని, ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచే ఉచిత సర్వీసును అందిస్తున్నామన్నారు. మొదటగా కేబుల్ ఆపరేటర్ల ద్వారా సర్వీసులను అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కేబుల్ ఆపరేటర్లు సహకరించకపోతే కొత్త వారికి అవకాశం ఇస్తామన్నారు.

మాట్లాడుతున్న ఎపి ఫైబర్ నెట్ మేనేజర్ గౌతమ్ కుమార్

రీ సర్వేలో లోపాలను సరిదిద్దాలి

- 'స్పందన'లో రైతుల వినతి
- 175 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగికి చెందిన భూములను రీ సర్వే పేరుతో కొందరు అక్రమ పద్ధతిలో హక్కు పత్రాలను సృష్టించారని ఆ గ్రామానికి చెందిన రైతులు దానేసు, అప్పలరాముడు, సుధారాణి, నరసమ్మతో పాటు పలువురు రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దశాబ్ద కాలంగా న్యాయపరిధిలో పోరాడి విజయం సాధించిన రైతులను కాదని కొందరు పెత్తందారులకు హక్కును కల్పిస్తూ రెవెన్యూ సిబ్బంది పత్రాలు ఇచ్చారని తెలిపారు. వారి హక్కు పత్రాలను తక్షణమే రద్దు చేసి, సాగులో ఉన్న రైతులకు పాసు పుస్తకాలు ఇప్పించాలని కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 175 వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి వినతులను స్వీకరించారు. కొత్తూరు మండల కేంద్రానికి సమీపాన పూర్వీకుల నుంచి తనకు 70 సెంట్ల విస్తీర్ణం గల భూమి ఉందని, తాను శ్రీకాకుళంలో ప్రస్తుతం నివాసం ఉండడం వల్ల స్థానికులు ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారని గురిటి మహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. హిరమండలం మండలం గూనభద్రకు చెందిన ముద్దాడ రాజేశ్వరరావు తనకున్న 86 సెంట్ల విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని వంశధార ప్రాజెక్టు అవసరార్థం ప్రభుత్వం తీసుకున్నా, ఇంతవరకు తనకు నష్టపరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. వినతుల స్వీకరణ అనంతరం డిఆర్ఒ గణపతిరావు మాట్లాడుతూ స్పందనలో వచ్చిన వినతులపై అలసత్వం లేకుండా సత్వరం పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డిఇఒ వెంకటేశ్వరరావు, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, ఉద్యానశాఖ ఎడి ఆర్.వి ప్రసాదరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరులోగా కంటి శస్త్రచికిత్సలు

శ్రీకాకుళం అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి ఆపరేషన్ల కోసం నమోదైన కేసులను ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఎన్‌జిఒ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇదివరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో నమోదైన కళ్లద్దాల పంపిణీ, కేటరాక్టు శస్త్రచికిత్సల కోసం కోసం నమోదైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో శంకర్ ఫౌండేషన్, జెమ్స్, ఆరోగ్యవరం ఆస్పత్రులకు సంబంధించిన ఎన్‌జిఒ ప్రతినిధులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDL DISTRICT JUDGE AT SRIKAKULAM.
OS. 22/2021

Between: **Jarugulla. padmavathi**
--Plaintiff
And: **Sadhu. Simhachalam & 7 others**
--Defendants

To,
D-7: శిష్టు లక్ష్మి, W/o నారాయణరావు, వయస్సు 35 సం॥లు ఇంటి నెంబర్లు 1-1, మెయిన్ వీధి, ఉర్జాం గ్రామం, పోలాకి మండలం, శ్రీకాకుళం జిల్లా.
D-8: అరిశెట్టి సంతోషకుమార్, S/o వెంకటరమణ, వయస్సు 38 సం॥, ఇంటి నెంబరు 329, హడ్కోకాలనీ, బలగ, శ్రీకాకుళం టౌన్ & జిల్లా.

పై నెంబరు గల దావాలో వాది షెడ్యూల్ ఆస్థిలో తన వాటా నిమిత్తం దాఖలు చేసియున్నారు. ఈ దావాలో **D-7&D-8** లు ప్రతివాదులుగా చేరియున్నారు. సదరు OS. 22/2021 దావాలో మీకు ఎన్ని ముర్లు కోర్టు వారు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున సదరు కోర్టు వారు తే01/12/23 దిన పబ్లికేషన్ ఆర్డర్ చేసియుంటిది. కావున సదరు దావాలో **తే05/02/2024 దిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు.** కావున ఆరోజు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేసికోవలెయును, లేని ఎడల మీ పరోక్షముగా తీర్పు చెప్పబడును.

// కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం //

భైరి దామోదరరావు
మూకల్ల సింహాద్రినాయుడు
వాది తరువు న్యాయవాదులు, శ్రీకాకుళం,
ఫోన్: 9440112790, 7013049781.

సభ్యుల్లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కోరం లేక మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి తెలిపారు. అయితే దువ్వాడ వర్గీయులు కొంతమంది ఎంపిటిసిలు ఆయనతో పర్యటనకు వెళ్లారు. జెడ్పిటిసి దువ్వాడ వాణి వర్గీయుల ఎంపిటిసిలు బాయ్ కట్ చేశారు. ఈ సమావేశం వాయిదా మంగళవారానికి పడింది. అయితే వాణి టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జిగా తొలగించడంతో ఈ వివాదానికి అజ్యం పోసినట్లు అయింది. ఈ సమావేశం మంగళవారమూ జరుగుతుందా? లేదా? ఆసక్తిగా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒకటే పార్టీలో రెండు గ్రూపులుగా విడిపోవడంతో నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. సమావేశానికి ఎంపిపి అట్లా సరోజనమ్మ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పోలీస్ స్పందనకు 31 ఫిర్యాదులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా సమస్యలను చట్టపరిధిలో పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 31 వినతులను స్వీకరించారు. ఆస్తి తగాదాలు పది, కుటుంబ కలహాలు నాలు, చీటింగ్‌పై మూడు, సివిల్ ఐదు, తదితర ఫిర్యాదులు 9 అందాయి. అనంతరం స్వయంగా ఫిర్యాదుదాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె న్యాయమైనది

వజ్రపుకొత్తూరు : అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ 42 రోజులు నిరవధికంగా సమ్మె కొనసాగిస్తుంటే ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సరికాదని సిపిఎం జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు విమర్శించారు. మండలంలోని నగరంపల్లిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా సమ్మె చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. గౌరవ వేతనంతో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు అత్యవసర సర్వీసుల కిందకు ఎలా వస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే జులైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వ పక్షాన ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంగన్వాడీలను విధుల నుంచి తొలగించి కొత్తగా నియామకాలపై నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటనపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

నత్తలే జీవనాధారం

సున్నం తయారీ బట్టి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం తీర ప్రాంతంలో చాలా కుటుంబాలకు నత్తలే జీవనాధారం. నత్త గుల్లలు చాలామందికి పరిచయమే. సముద్ర తీరంలో విరివిగా దొరికే ఈ నత్త గుల్లతోనే సున్నం తయారు చేస్తారు. ఈ నత్త గుల్ల సేకరించి సున్నం తయారు చేయడం ఈ ప్రాంతంలో చాలామందికి జీవనోపాధి కల్పిస్తుంది. పూర్వం మట్టి ఇళ్లు ఎక్కువగా ఉన్నప్పుడు గోడలకు నత్తలతో తయారు చేసిన సున్నాన్ని విరివిగా వాడేవారు. ఉద్దానం తీర ప్రాంతంలో అత్యధిక మంది సొంతంగా సాంప్రదాయక సున్నం తయారు చేసే అవసరాలకు వినియోగించుకుంటూ ఉపాధి పొందేవారు. ఇప్పుడు అధునాతన రంగులు మార్కెట్లోకి రావడంతో నత్తలతో తయారు చేసిన సున్నం వినియోగం చాలా వరకు తగ్గినా... చాలా మంది నీటికి ఇదే జీవనోపాధిగా చేసుకుని బతుకుతున్నారు.

తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న సముద్రపు పరలు గడ్డలు కాలువల్లో అక్కడక్కడ ఉన్నా పెద్ద పెద్ద చెరువుల్లో కూడా ఈ నత్త గుల్లలు లభిస్తున్నాయి. చిన్నకొత్తూరు, వజ్రపుకొత్తూరు, పల్లిఊరు, పూడిలంక, భావనపాడు, మిద్దివానిపాలెం, నువ్వలరేవు తదితర గ్రామాల్లో అనేక మంది నత్తలను సేకరిస్తూ ఉపాధి పొందుతున్నారు. వాటితో సున్నం తయారు చేసి మరి కొంత మంది ఉపాధి పొందుతున్నారు. తక్కువ పెట్టుబడి పెద్దగా ఖర్చు లేని ముడి సరుకు వినియోగించి సహజసిద్ధమైన సున్నాన్ని తయారు చేసి గతంలో అత్యధిక లాభాలు పొందేవారు. ఇళ్లకు జీడి పిక్కల పరిశ్రమలకు దుస్తులు ఉతికెందుకు ఎక్కువగా వినియోగించేవారు. పూర్వం రోజుల్లో పెద్దపెద్ద వాళ్లు నత్తలను ఉపయోగించి తయారు చేసిన గానుగ సున్నం బవంతులు కట్టుకోవడానికి వినియోగించేవారు.

నత్తగుల్ల జీడిపెక్కల కాడలు, ఎండిన జీడి పళ్లు, కొబ్బరి మట్టలు, కొబ్బరి డొక్కలు, కమ్మలు బొగ్గు సున్నం తయారీలో వినియోగిస్తారు. నత్తలను జీడి వ్యర్థాలను మిశ్రమం చేసి బట్టిలపై సుమారు 12 నుంచి 15 గంటల వరకు కాల్చు చేస్తారు. భట్టిలో నుంచి సున్నాన్ని వేరు చేసి చల్లని నీటితో చల్లబరుస్తారు. అనంతరం తెల్లగా మారిన నాణ్యమైన సున్నాన్ని బస్తాల్లో నింపి విక్రయిస్తారు. ఈ సున్నాన్ని మట్టి గోడలకు రంగులు వేసేటప్పుడు వినియోగిస్తారు. జీడిపిక్కలు పరిశ్రమంలో పనిచేసే కార్మికులు చేతులకు బొబ్బురులు రాకుండా ఉండేందుకు వాడుతారు. బట్టలు ఉతికేటప్పుడు మురుగుపోవడానికి వినియోగిస్తారు.

ఒక ట్రాక్టర్ లోడ్ నత్తల సేకరించి సున్నం తయారు చేయడానికి దాదాపు రూ.ఎనిమిది వేల వరకు ఖర్చు అవుతుంది. దీని నుంచి సుమారు రూ.12వేలు విలువ చేసే సున్నాన్ని పొందుతున్నడంతో నిర్వాహకులు దీనిపై ఆసక్తి చూపుతున్నారు.

తరతరాలుగా...

తరతరాలుగా మా కుటుంబం సున్నం తయారీ చేస్తుంది. తీర ప్రాంత గ్రామాల నుంచి నత్తలు, జీడి వ్యర్థాలు సేకరించి బట్టిలు వద్ద సున్నం తయారు చేస్తాం. ఒక్కో బస్తా సున్నం ధర రూ.200 పలుకుతోంది. తక్కువ పెట్టుబడి కావడంతో ఇదే వృత్తిని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం సహకరిస్తే బాగుంటుంది.

- మెట్టూరు కుర్మారావు, సున్నం తయారీదారు, వజ్రపుకొత్తూరు

ముడి సరుకులను సిద్ధం చేస్తున్న తయారీదారులు

నత్తలను సేకరిస్తున్న తయారీదారులు

వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

అచ్చెన్నాయుడుతో పాకివలస ముస్లిములు

కోటబొమ్మాళి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు టిడిపి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మడలో అచ్చెన్నాయుడు ఉన్నారని తెలుసుకొని జిల్లా నలుమూలల నుంచి టిడిపి నాయకులు సోమవారం చేరుకుని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, కురుడు పంచాయతీ పాకివలసకు చెందిన ముస్లిం మహిళలు కలిసి తమ సమస్యలు తెలియజేశారు. కాగా, నందిగాం మండలం కల్లాడ పంచాయతీ మథనాపురానికి చెందిన పైల అప్పలస్వామి, తాతారావులు అచ్చెన్న సమయంలో టిడిపిలోకి చేశారు. వారికి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

అలాగే శ్రీజగన్నాథపురానికి చెందిన టిడిపి రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి సాసుమహంతి ఆనందరావు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అచ్చెన్న ఆనందరావును పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లర్పించారు. ఈయనతో పాటు బెండి అన్నపూర్ణ, కొర్రాయి మల్లేశ్వరావు, దుద్దు దానయ్య, కూన జానర్ధనరావు, కాళి రామారావు, భాస్కరరావు ఉన్నారు.

కొనసాగుతున్న దీక్ష

కవిటి: తమజాతి గుర్తింపు కోసం ఇంకా ఎన్నేళ్లు నిరీక్షించాలని బెంతు ఒరియాలు ప్రశ్నించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగ అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పరిష్కారం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అందులో భాగంగా 26వరోజు జరుగుతున్న దీక్షలో విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి. ప్రసాదరావు సోమవారం పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎం.సీతాలు, బెంతు ఒరియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న ప్రసాదరావు

బైక్ ఢీకొని ఉద్యోగి మృతి

ఉమామహేశ్వరి (ఫైల్)

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని సోమవారం ఉదయం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి.ఉమామహేశ్వరి (50) మృతి చెందింది. గుజరాపతిపేటలో ఉంటున్న ఆమె ఆటోలో విధులకు వచ్చారు. ఆటో దిగి రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆమె రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమై ఘటనాస్థలంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎచ్చెర్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఉమామహేశ్వరి కుటుంబానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.డి.ఎల్.పి.క్రిస్టియన్, సిబ్బంది మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆమె మృతికి సంతాపం తెలిపారు.

వ్యక్తిపై దాడి

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టేవలసకు చెందిన చింతు సూర్యనారాయణపై తన భార్య చింతు జోగమ్మ, కుమారుడు తులసీరావులు దాడి చేసి గాయపరిచారని సోమవారం స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. సూర్యనారాయణ, జోగమ్మ మధ్య మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. అయితే ధాన్యం తమ వాట ఇవ్వమని సూర్యనారాయణ ఇంటికి వెళ్ళి భార్య, కుమారుడు అడుగగా, తాను వాట ఇవ్వనని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని అనడంతో ఇరువరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో జోగమ్మ, కుమారుడు తులసీరావు కలిసి సూర్యారావుపై కర్రతో దాడి చేయటంతో తీవ్రంగా గాయపడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సూర్యారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

విప్లవ యోధుడు లెనిన్

పలాస : మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో సోమవారం ఘనంగా లెనిన్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ విప్లవ యోధుడు లెనిన్ అని కొనియాడారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ప్రజా సంఘాల నాయకులు ఆర్.మాధవరావు, కుత్తుము హేమక్క, బర్ల గోపి, జానకమ్మ, కామేశ్వరరావు, సింహాద్రి, మొగలింగం, భాస్కరరావు, కోనారి దానయ్య, వంకల తాతారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ రమణారావు

రీ సర్వేకు సహకరించాలి

బూర్జ: మండలంలోని అల్లెనలో చేపడుతున్న భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ రమణారావు కోరారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లెన, కిలంతరి, గంగా, భగీరథపురం గ్రామాల్లో డ్రోన్ కెమెరా ద్వారా సర్వే నిర్వహించామని అన్నారు. దాని ద్వారా తప్పులు దిద్దుబాటు ఏమైనా ఉంటే రైతులు రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని అన్నారు. సమావేశంలో సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు, సర్వేయర్ రాంబాబు, విఆర్‌ఒ దాలయ్య, కార్యదర్శి అమర్నాథ్, మాజీ సర్పంచ్ బాలచంద్రమౌళీశ్వరరావు, గేదెల రామినాయుడు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

బీమా చెక్కు అందజేత

కొత్తూరు : మండలంలోని గులివిందలపేటలో విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందారు. ఈయకు వైఎస్‌ఆర్ బీమా వర్తించడంతో మృతుడి భార్యకు రూ.5 లక్షలు మంజూరైంది. దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.పది వేలు అందజేశారు. మిగతా రూ.4.9000 వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే రెడ్డి శాంతి మృతి భార్య విజయలక్ష్మికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ప్రతినిధి జి.నాగేంద్ర పాల్గొన్నారు.

వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తాడివలసలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని పారదర్శకత పాలన అందిస్తున్న రాష్ట్రంగా ఎపి నిలుస్తుందని అన్నారు. అనంతరం ఒకొక్క లబ్ధిదారునికి ఎంత మేరకు ఆర్థికసాయం అందిందో వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, తమ్మినేని వాసు, తమ్మినేని కృష్ణకుమారి, పైడి పోలయ్య, గురుగుబెల్లి లక్ష్మణరావు, తమ్మినేని ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలపై పెను భారాలు

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలపై మోయలేనంత భారాలు మోపి అస్తవ్యస్త పాలన కొనసాగించారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ధ్వజమెత్తారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో వైఫల్యం చెందారన్నారు. విద్యుత్, ఆర్‌టిసి, నిత్యావసర వస్తువుల ధరలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నా చోద్యం చూస్తున్నారన్నారు. చెత్తపై, ఇంటిపై, ఆస్తిపై వినోదంపై పన్నులు విధించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈమెతో పాటు నాయకులు లోపింటి రాధాకృష్ణారెడ్డి, జల్లు రాజీవ్, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నురు కృష్ణమూర్తి, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు కైబాటి రాజు ఉన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న తెరవే సభ్యులు

ఘనంగా 'గిడుగు' వర్ధంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కిమ్స్ రోడ్‌లో తెలుగు రచయితల వేదిక సభ్యులు గిడుగు వెంకటరామమూర్తి పంతులు 85వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమానికి ఆద్యుడై విశేష కృషి సల్పి, సఫలీకృతం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇద్ది పాపయ్య, భోగెల ఉమామహేశ్వరరావు, సోడవరం ఈశ్వరరావు, కొప్పల సూర్యనారాయణ, తంగి ఎర్రమ్మ, డబ్బీరు గోవిందరావు, సిహెచ్.రమాదేవి, టి.లింగరాజు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళాజాతా బృందం ద్వారా అవగాహన కల్పించారు. పురపాలక సంఘ పరిధిలోని 5వ వార్డు పరిధిలోని సొట్టవానిపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో కళాజాతా బృంద సభ్యులు కె.శంకర్రావు, కె.రామారావు, ఎం.లక్ష్మిలు ఆర్థిక అక్షరాస్యతపై స్వయంశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాల గురించి సోమవారం అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిఒ మెట్ట అమ్మినాయుడు, ఆర్‌పిలు వరలక్ష్మి, జయలక్ష్మి, సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వినతిపత్రం అందజేస్తున్న జానపద కళాకారులు

జానపద మ్యూజియం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాసలో జానపద మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయాలని జానపద కళాకారులు కోరారు. ఈ మేరకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతం జానపద కళలకు పుట్టిళ్లలాంటిందని అన్నారు. ఉత్తరాంధ్రలోను ప్రత్యేకమైన యాస, భాషతో ఎన్నో జానపద కళారూపాలు జానపద బాణిలను చైతన్య గీతాలు కలిగి ఉండడమే కాకుండా ప్రాచీన చరిత్ర, సంస్కృతిక సంప్రదాయాలకు నిలయమన్నారు. ప్రాచీన జానపద యంత్ర వాయిద్యాలు, సాహిత్యం, పనిముట్లు, కట్టుబాట్లు, వేష బాషలు వంటి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలంటే పలాసలో ఒక మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా చొరవ చూపాలని మంత్రిని కోరారు. అలాగే మాకన్నపల్లిలో తమ సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్న క్రీడామైదానానికి 120 అడుగులు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సైన దేశయ్య, కుత్తుమ వినోద్, ఎం.దేవరాజు, ఎం.వాసు, నక్క వాసు, గొరకల లోకేశ్వరరావులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ఆమదాలవలస: టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 13వ వార్డు విద్యానగర్‌లో బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి పోస్టర్లను పంపిణీ చేశారు. యూనిట్ ఇన్‌ఛార్జి గురయ్య, వేణుగోపాలరావు, బాలు పాల్గొన్నారు.

సాయిరాజ్ పరామర్శ

ఇచ్ఛాపురం : మండలంలోని బిర్లంగి మాజీ సర్పంచ్ బాకీ లక్ష్మీనారాయణ కుమార్తె బాకీ యోగి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విజయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సోమవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం మున్సిపాలిటీలోని అమీనసాహెబ్‌పేటలో సాలిన దీనబందు కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. ఈయన వెంట కంచిలి ఎంపిపి పైలా దేవదాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పడ రాజారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, టౌన్ జెజిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, రంపత్ని చిట్టిబాబు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటించాలని, యూనివర్సిటీ ఒక విజ్ఞాన ప్రపంచమని విసి కె.ఆర్.రజని అన్నారు. ఈ సందర్భంగా బోధన, భోదనేతర సిబ్బంది సోమవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తమలో తమను విశ్లేషించుకుని నిస్వార్థంతో సేవలందించాలన్నారు. సమయపాలన పాటిస్తూ అవినీతికి దూరంగా ఉంటూ యూనివర్సిటీకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరుతో ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయం ప్రతిష్ట మరింత ఇనుమండించే విధంగా వ్యవహరిస్తూ ప్రగతిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న విసి రజని

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

29న 'చలో టెక్కలి'

టెక్కలి : ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన ఈనెల 29న చలో టెక్కలి ర్యాలీ చేపడుతున్నామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. ఈ మేరకు టెక్కలిలో పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో బెంతు ఒరియాలు లేరన్న అంశంపై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రం అందించమని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందన లేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బైదులాపురం సింహాచలం, కార్యదర్శి గేదెల శేషగిరి, హరిపురం ఆనందరావు, పెద్దింటి నేపాల్, అన్నపురం చిన్నారావు, పార్వతీశం పాల్గొన్నారు.

జగనన్న... మా ఇల్లేవన్నా?

- కట్టినవి కూల్చేశారు
- కొత్తగా కడతామని చేతులెత్తేశారు
- వరకకు చెందిన లబ్ధిదారుల ఆవేదన

కూల్చేసిన నిర్మాణాల వద్ద సావిత్రి

ప్రజాశక్తి- కవిటి

2008 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారందరికీ ఇందిరమ్మ కాలనీలో ఇళ్లు మంజూరు చేశారు. కొంతమంది పునాదులు వేశారు, మరికొందరు గోడల వరకు కట్టారు, ఇంకొందరు శ్లాబ్ వరకు పని పూర్తిచేశారు. ఆ తరువాత ప్రభుత్వాలు మారడంతో అవి అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇక 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక వారికి మంజూరు చేసిన ప్రదేశంలోనే జగనన్న కాలనీకి కేటాయించారు. అయితే అప్పటికే అక్కడ అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న వీరి నిర్మాణాలు అడ్డంగా ఉన్నాయని అధికారులు భావించారు. లబ్దిదారులను సంప్రదించకుండానే వారికి మళ్లీ ఇళ్లు మంజూరు చేస్తామనే అపోహలో కట్టిన ఇళ్లు తొలగించేశారు. కానీ, ఇప్పటి వరకూ వారి ఇళ్ల నిర్మాణం మాత్రం జరగలేదు. ఏమని అధికారులను అడిగితే మీకు ముందే ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు కాబట్టి ఇప్పుడు మళ్లీ చేయడానికి కాదని చెబుతున్నారు. మరి అలాంటప్పుడు మేం నిర్మించిన ఇళ్లు ఎలా పడగొట్టారంటే వారి దగ్గర సమాధానం లేదు. చివరకు స్థానిక నాయకుల ద్వారా నియోజకవర్గ నేతలను సంప్రదించినా ఫలితం లేకపోయింది. అటు కాలనీలో ఇళ్లు లేక ఇటు ఉంటున్న పూరిళ్లు కొత్తగా నిర్మించుకోలేక రెంటికీ చెడ్డ రేవటిలా మారింది వారి పరిస్థితి. దీంతో గత ఐదేళ్లుగా కవిటి మండలం వరకకు చెందిన సావిత్రి పురియా, గున్ని పురియా, మోహిని పురియా, క్రాంతి బిసాయి, మేనకా సాహు, పార్వతి మజ్జి, భూదేవి పురియా, భూదేవి మజ్జి, బోలియాశెట్టి సావిత్రి, బెహరా హైమ, భారిక పురియా, వల్లభ పురియాకు నిరీక్షణే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి జరిగిన పొరపాటు సరిచేసి తమకు ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని కోరుతున్నారు.



అప్పటి శిలాఫలకం

ఇల్లు లేకుండా పోయింది

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం కూడా గోడల వరకు పూర్తి చేశాను. ఆ తరువాత ప్రభుత్వాలు మారడంతో మాకు నిరాశ ఎదురైంది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చాక మమ్మల్ని సంప్రదించకుండానే మా ఇంటి నిర్మాణాలు కూల్చి వేశారు. ఏమంటే మీకు ఇంతకు ముందే ఇల్లు మంజూరైనట్టు రికార్డులో ఉందని అంటున్నారు.

- గున్ని పురియా, వరక

ఇల్లు కూల్చేశారు

అప్పటి ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణాలు జరుగుతుండగానే ప్రభుత్వాలు మారిపోయాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న ఇళ్లు మాకు సంబంధం లేకుండానే కుల్చివేసింది. ఇక అప్పటి నుంచి మా 14 మంది సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. ఇప్పటికైనా మా సమస్య గుర్తించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నాను.

- సావిత్రి పురియా, వరక

మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్ కుమార్

తక్కువ ఖర్చుతో స్కిన్ గ్రాఫ్టింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అత్యాధునిక వ్యాక్యూమ్ డ్రెస్సింగ్ ద్వారా బాధితుడికి అధునాతన వైద్యం అందజేసి కుళ్లిపోయిన కాలును తొలగించకుండానే నయం చేశామని జనరల్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శిష్టు మనోజ్‌కుమార్ తెలిపారు. నగరంలోని అర్కాయ హెల్త్ సెంటర్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలోని మంగుళూరులో జరిగిన పడవ ప్రమాదంలో పోలాకి మండలం గుప్పిడిపేటకు చెందిన చెక్క ఎర్రయ్య కాలికి గాయాలయ్యాయ అన్నారు. అక్కడి ప్రభుత్వాస్పత్రిలో పది రోజులు చికిత్స పొంది శ్రీకాకుళం చేరుకున్న బాదితుడు ఎర్రయ్యకు సుగర్ వ్యాధి నిపుణులు కిల్లి చినబాబు సూచన మేరకు ఆస్పత్రిలో చేర్చి వైద్యం అందించినట్టు తెలిపారు. కాలు పూర్తిగా తొలగించాలని పలువురు వైద్య నిపుణులు సూచించిన మీదట తన వద్దకు చేరారని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎర్రయ్యకు అత్యాధునిక వైద్యమైన వ్యాక్యూమ్ డ్రెస్సింగ్ ద్వారా చికిత్స అందించినట్టు చెప్పారు. రికవరీ కావడంతో స్కిన్ గ్రాఫ్టింగ్ చేయడంతో కాలు పూర్తిగా నయమైనట్టు తెలిపారు.

30, 31న రాష్ట్ర మహాసభలు

పోలాకి : తబుకులో ఈనెల 30, 31న రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దబ్బరు కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గీత కార్మికుల ఐక్యత హక్కుల సాధనకు కృషి చేస్తున్నామని అన్నారు.

పలాస : అవగాహన కల్పిస్తున్న చైర్మన్ గిరిబాబు

డ్వాక్రా మహిళలకు అండ

పలాస: వైసిపి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అండగా నిలిచిందని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తపురం, రోటరీ నగర్‌లో డ్వాక్రా సంఘాల మహిళలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా మహిళలు బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలను మాఫీ చేశారని అన్నారు. ఇందులో భాగంగా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమచేస్తున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లో పార్టీలకఅతీతంగా డ్వాక్రా మహిళలకు డబ్బులు నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరాను వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సనపల సింహాచలం, స్వప్న, మణి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో గడపగడపకు వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పించినట్లు ఏరియా కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు మహిళా సంఘాల సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 23న సిఎం జగన్ ప్రారంభిస్తారని, 26 నుంచి సమావేశాలు నిర్వహించి తమ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని అన్నారు. 1318 మహిళా సమాఖ్య సంఘాలు, 13,702 మందికి రూ.9,74,13,905 మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గురుబెల్లి నారాయణరావు, సిసిలు పద్మ, వరదరాజులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన ఉండాలి

రణస్థలం రూరల్: ఇవిఎంలపై అవగాహన కలిగి ఉండాలని ఓటర్ల నమోదు అధికారి, డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ 2024 షెడ్యూల్ ప్రకారం 309 పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా సంబంధించిన తుది ప్రచురణ వివరాలు విడుదల చేశామన్నారు. తహశీల్దార్ కార్యాలయం నోటీసు బోర్డు వద్ద ఫారం-16 ప్రచారం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, రామినాయుడు, కామరాజు, పోలీస్, కనకరావు, మన్నె సురేష్ కుమార్, కొత్తకోట్ల సింహాద్రినాయుడు, రామారావు, తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ డిటి జి.కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సింగుపురంలో 1977-78లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని కృష్ణా ప్లాజా కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా అప్పటి ఉపాధ్యాయులు ఎం.సుబ్రహ్మణ్యం, ఐ.అనుసూయ, కె.నాగలక్ష్మి, భైరి అప్పారావు, శంకరరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి వారు ఒకే వేదికపైకి వచ్చి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుండ మాధవరావు, అనుపోజు బాబూరావు, జామి చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పలాస: 60 ఏళ్ల క్రితం వారంతా చిన్ననాటి స్నేహితులు ఒకేచోట ఆటపాటలు నడుమ చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాలు చేస్తుండగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో 1963 పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళన ప్రేరణ తరగతులు సోమవారం నిర్వహించారు. 60 ఏళ్ల క్రితం ఇదే పాఠశాలలో చదివి మళ్లీ ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ విద్యార్థులతో ఆనాటి సంతోషాలను పంచుకున్నారు.అనంతరం తమవంతుగా పాఠశాలకు రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్‌ని అందజేశారు. ఇంపాక్ట్ ఇంటెర్నేషన్ ప్రేరణ సంస్థ డైరెక్టర్ డి.సుబ్బారావు విద్యార్థులకు మనోవికాస ప్రేరణ తరగతులు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, సుబ్బారావు, కంబుక్త, రాజభూషణం, భీమారావు, అప్పారావు, శంకరాచారి, వెంకటరావు, ముఖలింగం, మిన్నారావు పాల్గొన్నారు.

వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కిట్లను అందిస్తున్న నాయకులు

క్రీడా కిట్లు పంపిణీ

కవిటి: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవలేదని, వారిలోని ప్రతిభను వెలికితీసి బాహ్యాప్రపంచానికి తెలియచెప్పేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం రూపొందించినట్టు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రాకు ఎంపికైన క్రీడాకారులకు ఆట వస్తువులను సోమవారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసం పెంపొంది, పోటీతత్వం అలవడుతుందని అన్నారు. నియోజవర్గ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎఎంసి వైస్ చైర్మన్ వై నీలయ్య, రెడ్డికి జెఎసి కన్వీనర్ బర్ల నాగభూషణం, ఎంపిటిసిలు పూడి నీలాచలం, డి.సతీష్, పి.కృష్ణారావు, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, మండల ఎఒ శ్రీనివాసరెడ్డి, ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న ఈశ్వరరావు

క్రికెట్ విజేత గరుడభద్ర

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస ,ఇచ్ఛాపురం నియోజకవర్గాల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన గరుడభద్ర క్రికెట్ జట్టు క్రీడాకారులను సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావులు అభినందించారు. మండలంలోని అంబుగాంలో ఆఖరి పోరులో కర్లిపాలెం జట్టుపై గరుడుభద్ర జట్టు విజయం సాధించింది. దీంతో విజేతలకు షీల్డ్‌తో పాటు రూ.పది వేలు నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కర్లిపాలెం జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.8 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.నవీన్ కుమార్, పాపారావు, మాధవరావు, సంతోష్, ధనరాజ్ పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో విసిగిపోయారు'

మాట్లాడుతున్న బాబూరావు

పలాస: రాష్ట్రంలో వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారని, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నాలుగో వార్డు, మండలంలోని తర్లకోట, లొద్దభద్ర, అల్లుకోల పంచాయతీల్లో సోమవారం పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో భూకబ్జాలు, భూ ఆక్రమణలు పెరిగిపోయాయని, కానీ, అభివృద్ధి మాత్రం జరగలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో పల్లపు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. టిడిపి అందజేస్తామన్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో లోడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సవర రాంబాబు, కొవ్వూరు సురేష్, చెల్లూరి రామకృష్ణ, గోల చంద్రరావు, నబల్లి శ్రీను, కొత్త సత్యం, మోహనరావు, రట్టి వెంకటరావు, మల్లా శ్రీనివాసరావు, ఉమాకాంత్ పాల్గొన్నారు.

'జీడికి మద్దతు ధర ప్రకటిస్తాం'

ప్రజాశక్తి- మందస

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన సంయుక్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే జీడికి మద్దతు ధర ప్రకటిస్తామని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. మందస మండలం దున్నూరు పంచాయతీ మర్రిపాడు, పెద్దదున్నూరు, చిన్నదున్నూరు, మొగిలిపాడు, నొల్లూరు గ్రామాల్లో జనం జనం జనసేన ప్రభంజన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన అధ్వానంగా ఉందని, అరాచకాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన, కిడ్నీ వ్యాధుల నివారణ దిశగా పనిచేస్తామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, పందిరి నీలయ్య, లావేటి సురేష్, లబ్బ జోగారావు, రౌతు చిరంజీవి, సురేష్, బొంగు మురళి, తాళ్ల యాదవరావు, బబ్లు, టిడిపి నాయకులు లబ్బ రుద్రయ్య, ధర్మారావు గణేష్ తెప్పల, హేమ సుందరరావు, సౌరు రుద్రయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న దుర్గారావు

రణస్థలం రూరల్ : అన్నదానం చేస్తున్న సర్పంచ్ రజని

వజ్రపుకొత్తూరు : అన్నదానం చేస్తున్న హరినారాయణ

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని తిరుపతి పాలెంలో బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజని అధ్యక్షతన సోమవారం అన్నదానం నిర్వహించారు. అనంతరం చిన్నారులతో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకుల రవికుమార్, వెలిచేటి వేణు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యిపాడు పంచాయతీ తేరపల్లిలో వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరినారాయణ, సర్పంచ్ బత్సల ధర్మారావు, కీలు సునీల్, కర్రి ఢిల్లేశ్వరరావు, కీలు చిన్నారావు, కీలు లోకనాథం, కీలు మాధవయ్య పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ప్రసాద్

కొత్తపల్లి పిహెచ్‌సి తనిఖీ

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం అదనపు డిఎంహెచ్ఎఒ డాక్టర్ ఎం.ప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతల పరీక్షల శాతాన్ని పెంచాలని సూచించారు. పిహెచ్‌సిలో అమలవుతున్న వివిధ జాతీయ కార్యక్రమాలు అమలు తీరును పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులను వెంటనే ఖర్చు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్లు వరణ్, రమణారావు, డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ కలిసి టెక్కలి మండలంలో బూరగాం, శాసనం, నర్సింగపల్లి, మొఖలింగపురం, మేఘవరం, పోలవరం, రాధవల్లపురం, తిర్లంగి, సీతాపురం గ్రామ పంచాయతీలో సోమవారం విస్తృత స్థాయి పర్యాటన చేపట్టారు. నాయకులు కార్యకర్తలు కలిసి ప్రజా సమస్యపై చర్చించి కార్యకర్తలు భరోసా ఇస్తున్నారు. కార్యక్రమంలో మండలం నాయకులు చింతాడ గణపతి, జెసిఎస్ కన్వీనర్ శిగిలిపల్లి మోహన్, వైస్ ఎంపిపిలు పేరాడ రమేష్, మన్నేల కిషోర్, నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఉదయ్‌కుమార్

పెండింగ్ పనుల పూర్తికి కృషి

వజ్రపుకొత్తూరు: సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణ పెండింగ్ పనుల పూర్తికి కృషి చేయాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్ సూచించారు. తన ఛాంబర్‌లో అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ నిర్మాణశాఖ లక్ష్యాలను పర్తి చేయాలన్నారు. జగనన్న చేయూత కార్యక్రమం విజయవంతమయ్యేలా వెలుగు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట జోగారావు, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, మండల ఇంజినీర్ నాగభూషణం, గృహనిర్మాణ ఎఇ శ్రీకాంత్, వెలుగు ఎపిఎం జాంబవతి పాల్గొన్నారు.